# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో యూపీఐ ప్రారంభం కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశీయ సంస్థలకు DRDO క్షిపణి సాంకేతికతను బదిలీ చేసేందుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు.
- భారతదేశంలో తయారీ కార్యకలాపాలను ప్రారంభిస్తున్న హైటెక్ సంస్థలకు బీఐఎస్ ధ్రువీకరణలో మినహాయింపులు ఇస్తామని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.
- కొలంబో వేదికగా జరుగుతున్న భారత్-శ్రీలంక రెండో టెస్ట్ క్రికెట్ మ్యాచ్ మూడో రోజు ఆటకు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది.

======================

దశాబ్దం క్రితం ప్రారంభమైన “యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ - యూపీఐ” దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో ఓ చారిత్రక మైలురాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన యూపీఐ నేడు దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిందని వెల్లడించారు. యూపీఐ ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా దాని విస్తృతి, ప్రజల్లోకి చేరిన తీరు ప్రతి భారతీయుడు గర్వపడే అంశమని పేర్కొన్నారు. 10 సంవత్సరాల క్రితం యూపీఐ ప్రారంభం కావడం దేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ పోస్ట్ లో తెలిపారు. ప్రస్తుతం యూపీఐ 11 దేశాలకు విస్తరించగా... యూపీఐ లావాదేవీల పరిమాణం గత పదేళ్లలో దాదాపు 13 వేల రెట్లు పెరిగింది. 2016–17లో కేవలం కోటీ 78 లక్షల లావాదేవీలు నమోదుకాగా, 2025–26 నాటికి వార్షిక లావాదేవీల సంఖ్య 24 వేల 162 కోట్లకు పైగా చేరిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

======================

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను భారతీయ పరిశ్రమలకు బదిలీ చేసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. దీంతో దేశీయ సంస్థలు ఈ సాంకేతికతలను ఉపయోగించి భారత్‌లోనే క్షిపణులను తయారు చేసుకునేందుకు మార్గం సుగమం అవుతుందని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన క్షిపణి వ్యవస్థల టెక్నాలజీని అర్హత కలిగిన భారతీయ సంస్థలకు బదిలీ చేయనున్నారని... ఇందుకోసం అవసరమైన అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ సంస్థల నిబంధనలను కంపెనీలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రక్షణ తయారీలో దేశీయ సామర్థ్యాలను పెంచడం, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ విద్య కేవలం తరగతి గదులకే పరిమితం కాకూడదని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. విద్యార్థులు వ్యవసాయ క్షేత్రాల్లో, రైతులతో ప్రత్యక్ష సంభాషణలు జరపడం ద్వారా నేర్చుకునే విధంగా శిక్షణ ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలోని వాస్తవ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవడం ద్వారా వ్యవసాయ విద్య మరింత ప్రయోజనకరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `భారత వ్యవసాయ పరిశోధనా మండలి–ఐకార్ సంస్థల ఉపకులపతులు, డైరెక్టర్ల సదస్సు`ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ డిగ్రీ కోర్సుల్లో యువ విద్యార్థులకు సమర్థవంతమైన శిక్షణ అందించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. మారుతున్న కాలానికి, పెరుగుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు తమ బోధనా విధానాలను ఆధునీకీకరించాలని కేంద్రమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో తయారీ కార్యకలాపాలను ప్రారంభిస్తున్న హైటెక్ సంస్థలకు బీఐఎస్ ధ్రువీకరణలో మినహాయింపులు ఇస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. భారతదేశంలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన పరికరాలు, విడిభాగాలపై తప్పనిసరి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ధ్రువీకరణ నుంచి జపాన్ సహా హైటెక్ రంగ సంస్థలకు మినహాయింపు కల్పించే విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు చెప్పారు. టోక్యోలో ఈరోజు సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు రంగాలకు చెందిన జపాన్ సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సంస్థల అవసరాలను బట్టి కంపెనీ స్థాయి, పరిశ్రమ స్థాయి, ఉత్పత్తి స్థాయి లేదా నిర్దిష్ట ప్రాజెక్టు స్థాయిలో ఈ మినహాయింపులు కల్పించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. భారతదేశంలో తయారీ కార్యకలాపాలను ప్రారంభిస్తున్న హైటెక్ సంస్థలకు బీఐఎస్ ధ్రువీకరణలో మినహాయింపులు ఇస్తామని.. అవసరమైన పరికరాలు, వస్తువులు, సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చేయడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మరింత ఊతం లభిస్తుందని కేంద్రమంత్రి అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ డిజిటల్ కనెక్టివిటీ ప్రయాణం కేవలం ప్రజలను అనుసంధానించడానికే పరిమితం కాదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ప్రజలు విశ్వసించే, సురక్షితమైన, ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిరంతర సేవలు అందించగల టెలికాం నెట్‌వర్క్‌ల నిర్మాణమే ఈ ప్రయాణానికి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు "సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ - సీ డాట్ "(C-DOT) 43వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. దేశ టెలికాం రంగ పరివర్తనలో సీ-డాట్ కీలక పాత్ర పోషించిందని... ఈ సీ-డాట్ సంస్థ నేడు

ఆవిష్కరణలకు ఊతమిచ్చే ఒక ప్రధాన కేంద్రంగా రూపాంతరం చెందిందన్నారు. దేశీయ సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేస్తూ.. భారత టెలికాం రంగాన్ని ఆధునికీకరించడంలో సీ-డాట్ అందిస్తున్న సేవలు కీలకమని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం మహమ్మద్ ప్రవక్త  బోధనలను స్మరించుకునే సందర్భంగా నిలుస్తుందని రాష్ట్రపతి తన సందేశంలోపేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త  బోధనలు ప్రజలను సత్ ప్రవర్తన, కర్తవ్యనిర్వహణ మార్గంలో నడవడానికి ప్రేరేపిస్తాయని అన్నారు. అలాగే ఓణం పండుగ సందర్భంగా కూడా ద్రౌపది ముర్ము ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన పంట రాక సందర్భంగా ప్రకృతిపట్ల కృతజ్ఞత వ్యక్తం చేసే పండుగగా ఓణం నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓబీసీ క్రీమీ లేయర్ ప్రమాణాలపై కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించడానికి ఒక ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 అభ్యర్థుల కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన మార్చి 11 నాటి తీర్పు ఏ విధంగా వర్తిస్తుందనే దానిపై కేంద్రం స్పష్టత కోరుతూ.. పిటీషన్ దాఖలు చేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సిఫారసు చేసిన 958 మంది అభ్యర్థులకు సర్వీసు కేటాయింపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వానికి అనుమతినిచ్చే ఆదేశాలు కోరాలని డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ DoPT కోరింది. మార్చి 11 నాటి తీర్పునకు ముందు అమల్లో ఉన్న ఓబీసీ క్రీమీ లేయర్ ప్రమాణాల ఆధారంగానే ఈ కేటాయింపులు జరగాలని కోరుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కొలంబో వేదికగా జరుగుతున్న భారత్-శ్రీలంక రెండో టెస్ట్ క్రికెట్ మ్యాచ్ మూడో రోజు ఆటకు వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. 8 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో మూడో రోజు ఆట ప్రారంభించిన శ్రీలంక 8 వికెట్లు నష్టపోయి 265 పరుగులు చేసింది. భారత్ కంటే ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. భారత్ బౌలర్లు ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ మూడేసి వికెట్లు తీసి ఆతిథ్య జట్టుపై ఒత్తిడి పెంచారు. అంతకుముందు భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 503 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. భారత వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ ధ్రువ్ జురెల్ తన కెరీర్‌లో రెండో టెస్ట్ సెంచరీ సాధించి జట్టు భారీ స్కోరు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్ ఇప్పటికే తొలి టెస్ట్‌ను 165 పరుగుల తేడాతో గెలిచి 1-0 ఆధిక్యంలో నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =